
ఈవారం సరసం



# ప్రశ్నాపత్రం

శ్రీకారం రామ్మోహన్

ఎలాగైనా సరే ఈరోజు గౌతమ్‌తో అంతా తేల్చేసుకోవాలి అని మనసులో మరోసారి నిర్ణయించుకుంది మాలతి. గౌతమ్‌తో తన భవిష్యత్తు తేల్చుకోవాలంటే భూతం లాంటి తన భూతకాలం భయపెడుతోంది. తన స్నేహితురాలు లతతో తన సమస్య చెబితే 'కాలు జారి ఒకసారి ఒకడ్ని పోగొట్టుకున్నావ్, ఇప్పుడు నోరు జారి ఇతన్ని కూడా చేజార్చుకుంటావేమో ఆలోచించు' అంది.

దాని సలహాప్రకారం నోరు మూసుకుని ఊరుకోవటం ఉత్తమం. కాని తన అంతరాత్మ అందుకు అంగీకరించడం లేదు. అందులో గౌతమ్ లాంటి మంచి మనిషిని మోసం చేయటం తనకు అసలు ఇష్టం లేదు. అంత్య నిష్ఠూరం కన్నా. ఆది నిష్ఠూరం నయం అంటారు. అంతా తెలిసాక పెళ్ళి చేసుకోను పొమ్మని ముందే చెబితే చాలాహాయి. పెళ్ళయ్యాక విషయం తెలిసి పేచీలొస్తే జీవితమంతా నరకం కాగలదు. అందుకే గౌతమ్‌కి తన గతమంతా చెప్పేసి మనసు ప్రక్షాళనం చేసుకోవాలి. ఆ తర్వాత నిర్ణయం అతనిది. తను చేసింది ఏమంత ఘోరమైన పాపం కాదు. తనకు తెలిసి తన ఫ్రెండ్స్‌లో చాలా మందికి అలాంటి అనుభవాలు వున్నాయి. కాని అందరూ గప్‌చుప్‌గా 'కన్యా'దానం జరిపించేసు కుంటున్నారు. వాళ్ళనని లాభం లేదు. ప్రపంచమలా వుంది. తల్లిదండ్రులు కట్నానికి సరిపడా కూడబెట్టే వరకు శారీరకవాంఛలు చంపుకోవాలంటే అందరికీ సాధ్యమా? పాతికేళ్ళు దాటినా పెళ్ళిళ్ళు కావట్లేదు. ఇన్ని ఆకర్షణల మధ్య పదేళ్ళపాటు కన్యాత్వాన్ని కాపాడుకోవాలంటే కత్తిమీద సామే. ఒకరకంగా బాల్యవివాహాలే నయమేమో . వాళ్ళకి ఈ రంధి లేదు. ఏది ఏమైనా ఎటువంటి వ్యవస్థలోనైనా సమస్యలు మాత్రం ఆడవాళ్ళకే ఎక్కువ.

తను శీలవతిని కానని గౌతమ్ తనను నిరాకరిస్తాడా? శీలం అనే పదం విన్నప్పుడల్లా తనకు చచ్చే నవ్వొస్తుంది. అసలు శీలం అనే పదం ఇంగ్లీషులోని 'సీల్' నుంచి పుట్టి వుంటుందని తను అంటే లత గుక్కలు పట్టి నవ్వింది. నిజానికి 'శీలం' అనే పదానికి అర్థం లేదు. మనుషులకు నీతి, నిజాయితీ వుండాలి కాని 'సీలు విప్పని శీలం' మీద నమ్మకం కాదు. అందుకే తను వున్న విషయం గౌతమ్‌కి చెప్పేయదల్చుకుంది. అంతా తెలిసి అతను పెళ్ళికి ఒప్పుకుంటే సరి. లేదా ఎవడో ఒకడు దొరక్కపోడు. కనీసం తన అందం మీద తనకు నమ్మకముంది.

సమయం ఆరుగంటలు దాటింది. గౌతమ్ వచ్చే వేళయింది అనుకుంటూ వరండాలోకొచ్చి నుంచుంది మాలతి. గౌతమ్ అమాయకంగా కనిపిస్తాడు కాని గడుసువాడే. మొదట్లో తన నసలు గమనించనట్టే వుండేవాడు. పేరుకు తగ్గట్టు గౌతమ్ బుద్ధుడే అనుకుంది. తనే చొరవ తీసుకుని నెమ్మదిగా స్నేహం పెంచుకుంది. అతను చాలా మితభాషి. కాని తను మాట్లాడుతుంటే కన్నార్పకుండా తన వంకే చూస్తుంటాడు. అతని కళ్ళల్లో క్రమంగా తనపట్ల ఒక విధమైన ఆరాధన వ్యక్తమవడం తను కనిపెట్టింది. తనకు కూడా అతని మంచితనం, సౌమ్యత చాలా నచ్చాయి. నిన్న అతను చివరకు తెగించి 'మీతో ఒక ముఖ్యమైన



విషయం ఒంటరిగా మాట్లాడాలి' అన్నాడు.

'అయితే రేపు మా అమ్మా, నాన్న బయటకు వెళుతున్నారు. అప్పుడు రండి మాట్లాడుకుందాం' అంది తను. అతను ఏం చెప్పదల్చుకున్నాడో తనకు తెలుసు. కాని తను చెప్పదల్చుకున్నది విని అతను తట్టుకోగలడా అన్నదే సందేహం. మదన్‌తో తన ఎఫైర్ సంగతి చెబితే ఎలా స్పందిస్తాడనేది ఊహించలేకపోతోంది. మదన్ రెండేళ్ళ క్రితం ఇప్పుడు గౌతమ్ ఉన్న గదిలోనే ఉండేవాడు. గౌతమ్ కన్నా చాలా అందగాడు. చలాకీగా ఉంటాడు. భలే జోకులు వేసేవాడు. కాలేజీ చదువు పూర్తయి తను ఖాళీగా ఇంట్లో వున్న రోజులవి. తమ పక్క పోర్షనులో అద్దెకొచ్చాడు. ఏదో సినిమాపత్రికలో రిపోర్టరుగా పనిచేసేవాడు. సినిమా పత్రికలన్నీ అతని దగ్గర ఉండేవి. ఏమీ తోచనప్పుడు సినిమా పత్రికలు తెచ్చుకునేందుకు అతని గదికి వెళ్ళేది. వెళ్ళినప్పుడల్లా అతను సినిమా తారల వ్యక్తిగత విషయాలు చెబుతుంటే తనకు చాలా సరదాగా ఉండేది. ఎవరికీ తెలియని రహస్యాలు తనకు చెబుతున్నందుకు థ్రిల్‌గా ఉండేది. షూటింగుల్లో ప్రహసనాలు ఆసక్తికరంగా చెప్పేవాడు. చమత్కారంగా మాట్లాడేవాడు.

'మన తెలుగు సినిమాలకు నంది అవార్డులు ఎందుకిస్తారో తెలుసా?' అని అడిగాడు ఒకరోజు సాయంత్రం అతని గదికి వెళ్ళినప్పుడు.

'ఉత్తమ చిత్రాలు తీసినవాళ్ళకిస్తారు' అంది తను.
'కాదు. అందులో ఒక రహస్యం వుంది. మన తెలుగునిర్మాతలు ఉత్పత్తి చేసిన బుల్‌షిట్ ప్రపంచంలో ఎవరూ ఉత్పత్తి చేయలేరు. మరి 'బుల్‌షిట్' ఉత్పత్తిదారులను సత్కరించేందుకు 'నంది' అవార్డులు ఇవ్వటం సబబే కదా?' అన్నాడు.

అతని జోక్‌కి తను పడిపడి నవ్వింది. కొంగు జారిపోయిన సంగతి కూడా చూసుకోలేదు. అతని చూపులు ఎక్కడ నిలిచాయో తెలిసాక కొంగు సర్దుకుని లేచి వెళ్ళబోయింది. అప్పుడే సరిగా రాత్రి ఏడు గంటలైంది. విద్యుత్ బోర్డు వాళ్ళు ఠంచనుగా కోత అమలు జరిపారు. చీకట్లో తడబడుతూ లేచిన తను అతని మీదకు తూలిపడింది. అతని బాహువులు తనను గట్టిగా బంధించాయి. తొలిసారిగా పురుషస్పర్శ ఏదో తెలియని హాయిని కలిగించింది.

'సినీ తారలంతా నీ అందం ముందు దిగదుడుపే' అన్నాడతను చెవిలో రహస్యంగా.

అతన్ని వదిలించుకు రావటానికి తను ప్రయత్నం చేయలేదు.

మొత్తానికి ఆరోజు అనుభవం తనకొక మధురానుభూతిగా మిగిలిపోయింది. తనేమీ తప్పు చేసినట్టు కుంగిపోలేదు. అతన్ని పెళ్ళి చేసుకుంటే ఎలా వుంటుందని ఆలోచించింది. తల్లిదండ్రులతో ఆ ప్రస్తావన తెచ్చింది.

'సినిమా రిపోర్టరంటే ఠికాణా లేని ఉద్యోగం. జులాయి వెధవల్లే వున్నాడు. వాడితే పెళ్ళేమిటి?' అని చివాట్లు పెట్టింది తల్లి.

నిజమే, మదన్‌లో చాలా దురలవాట్లు వున్నాయి. నిజానికి మనిషి తనకు పూర్తిగా నచ్చలేదు. అతను కూడా తనను ప్రేమిస్తున్నట్టు ఎన్నడూ చెప్పలేదు. పెళ్ళి ప్రస్తావన తేలేదు. ఆరోజు నుంచి తను అతనికి దూరంగా వుండటం మొదలుపెట్టింది. మరో రెండు నెలలకు అతను రూమే ఖాళీ చేస్తున్నాడని తెలిసింది.

తరతరాలుగా పురాణాల ద్వారా, సాహిత్యం ద్వారా, సినిమాల ద్వారా ఆడపిల్లలకు నూరిపోసిన అపరాధనా భావం తనలో కూడా ఏ మూలనో వుందేమో. అందుకే అతను వెళ్ళేరోజు అతన్ని కలిసి తనే పెళ్ళి ప్రస్తావన తెచ్చింది. అతని జవాబు వినేటప్పటికి తను కోపంతో రుద్రకాళిగా మారింది. చెప్పు తీసుకుని చెడామడా కొట్టింది. 'నీలాంటి తిరుగుబోతుని నేను చస్తే చేసుకోను' అని అన్నాడతను. జరిగిన దానికి తానేమీ బాధపడలేదు. జీవితంలో అదో అనుభవం అంతే. కాని దాని మూలంగా జీవితమంతా చికాకులు ఉండకూడదు.

గౌతమ్ పెద్ద బ్యాంక్ ఆఫీసర్. తన తల్లిదండ్రులకు కూడా అతనంటే మంచి అభిప్రాయం వుంది. అతని ఉద్యోగం, వినయం, విధేయత వాళ్ళకి చాలా నచ్చాయి. అందుకే తను అతనితో చనువుగా వున్నా వాళ్ళు చూసీ చూడనట్టుగా వుంటున్నారు. లత చెప్పినట్టు అతను ప్రపోజ్ చేయగానే చప్పడు కాకుండా పెళ్ళి చేసుకోవడం నయమేమో. కాని మనసొప్పడం లేదు. మదన్ సంగతి అతనికి చెప్పేస్తాను. మరోసారి గట్టిగా నిర్ణయించుకుంది.

'ఆలోచనల్లో మునిగిపోయిన మాలతి గేటు చప్పుడుకు ఉలిక్కిపడింది. గౌతమ్ లోపలికి వస్తున్నాడు.

'హలో... నాకోసమేనా వెయిట్ చేస్తున్నారు. అరగంటలో వస్తాను' అన్నాడు తన పోర్షన్లోకి వెడుతూ.

'నేను డాబా మీద వుంటాను రండి' అంది మాలతి డాబా మెట్లెక్కుతూ.

డాబా మీద పున్నమి చంద్రుడు వెన్నెలను వెదజల్లుతున్నాడు. వాతావరణం చాలా హాయిగా వుంది. కొద్దిసేపటికి గౌతమ్ డాబా మీదకు వచ్చాడు. మీ ఇంట్లో ఎవరూ లేరుగా. కింద హాలులో కూర్చుని మాట్లాడుకుందాం. లేదా నాగదికి వెడదాం' అన్నాడు గౌతమ్.

'ఇక్కడ వెన్నెల చూడండి ఎంత బాగుందో. ఇక్కడే కూర్చుందాం' అంది మాలతి.

'సరే' అన్నాడు గౌతమ్ పిట్టగోడ మీద కూర్చుంటూ. అతని ఎదురుగా ఆమె కూర్చుంది. ఆమె మొహంలోకి అతను తదేకంగా చూస్తున్నాడు.

అతనలా చూస్తుంటే తను చెప్పదల్చుకున్నది, చెప్పగలనా అన్న సందేహం వచ్చింది మాలతికి.

'ఇక్కడ వీధి వైపు వద్దు. వెనకాల కూర్చుందాం రండి' అంది. వెనకాల కొంతమేర పెరటి చెట్ల నీడ పడివుంది. అక్కడకెళ్ళి కూర్చుంది మాలతి. గౌతమ్ఆమె వెంట వెళ్ళి ఆమె ఎదురుగా కూర్చున్నాడు.

వెన్నెల్లో గౌతమ్ నల్లని ముఖం నిగనిగా మెరుస్తోంది. అతని చిరునవ్వు ఎంతో మనోహరంగా అనిపించింది మాలతికి. మాలతి మీద చెట్టు నీడ పడుతోంది. మబ్బుల చాటు చందమామ లాగా వుంది ఆమె మోము. అతను ఆమె వంకే చూస్తూండడంతో ఆమె సిగ్గుతో తలదించుకుంది.

'లేడీస్ ఫస్ట్' అంటారు కాని ఇటువంటి విషయాలు ముందు మొగవాళ్ళే మాట్లాడాలి. నేను మిమ్మల్ని గాఢంగా ప్రేమిస్తున్నాను. మీకు అభ్యంతరం లేకపోతే మీ నాన్నగారితో మాట్లాడి పెళ్ళి చేసుకుంటాను. కాకపోతే ఒక ముఖ్యమైన....'

ఇంకేమీ చెప్పొద్దన్నట్టు మాలతి అతని అరచేతిని తన చేత్తో నొక్కింది.

'మీలాంటి సహృదయులు లభించటం నా అదృష్టం. అయితే మీరు నేను చెప్పేదంతా ఓపిగ్గా విని తుదినిర్ణయం తీసుకోండి.' అంది తలదించుకుని.

తల ఎత్తకుండా నెమ్మదిగా మదన్తో తన పరిచయం. అనుభవం, చివరకు తను చేసిన పరాభవం అన్నీ వివరంగా పూసగుచ్చినట్టు చెప్పింది. అతని స్పందన ఏవిధంగా వుంటుందో తెలుసుకునేందుకు మధ్యమధ్యలో తలెత్తి చూస్తోంది. అతను ఎటువంటి భావాన్ని ప్రకటించకుండా

**రచయితలకు మనవి**

**ఈవారం స'రసం' శీర్షికను ఆదరిస్తున్న పాఠకులకు మరింత పసందుగా కథలను అందించేందుకు మోతాదు మించని శృంగారంతో కథలను పంపండి.**

చిరునవ్వుతో నిర్వికారంగా ఆమె వంక చూస్తున్నాడు. ఆమె అంతా చెప్పటం పూర్తిచేసి అతని నిర్ణయం కోసం ఎదురుచూస్తున్నట్టు చూసింది. అతనిలో ఏవిధమైన మార్పులేదు... అదే చిరునవ్వు... అతని మంచితనానికి ఆమెకు సంతోషంతో కళ్ళల్లో నీళ్ళు తిరిగాయి. ఆమె కళ్ళలో నీరు చూసి అతను చలించిపోయాడు. ఆమెను దగ్గరకు తీసుకుని గుండెలకు హత్తుకున్నాడు. హర్షంతో వెన్నెల వారిమీద హర్షించింది.

* * * * *

శోభనం గదిలోకి మాలతి అప్సరసలాగా ప్రవేశించింది. గౌతమ్ ఆమెను దగ్గరకు తీసుకున్నాడు. మంచం పక్కనున్న స్విచ్ను నొక్కి లైటు ఆర్పేసింది మాలతి.

'మాలతి లైటు ఆర్పకు' అంటూ వెంటనే మళ్ళీ లైటు వేశాడు గౌతమ్.

'నేను నీతో ఒక ముఖ్యమైన విషయం చెప్పాలి మాలతి... పెళ్ళికి ముందే చెబుదామనుకున్నాను. కానీ నువ్వు పెళ్ళికి ఒప్పుకోవేమో అని భయమేసింది. ఆరోజు రాత్రి డాబా మీద నువ్వు చాలాసేపు మాట్లాడావు. కానీ... కానీ... నాకు ఒక్కముక్క కూడా వినిపించలేదు. నాకు రెండు చెవులు సరిగా వినిపించవు. పుట్టినప్పటి నుంచి వున్న సమస్య. అయితే అవతలి వాళ్ళ పెదవుల కదలికను బట్టి వాళ్ళు మాట్లాడేది అర్థం చేసుకోగలను. అందుకే ఆరోజు డాబా మీద వద్దు గదిలో మాట్లాడుకుందామన్నాను. వెన్నెలున్నా నువ్వు మాత్రం నీడలో కూర్చున్నావు. తలదించుకుని ఏమేమిటో చాలా చెప్పావు. నువ్వు నన్ను ఎంత కాలంగా, గాఢంగా ప్రేమిస్తున్నావో వివరంగా చెప్తావనుకుంటాను. నీమాటలు వినిపించక పోయినా నీమనసు నాకు అర్థమైంది. ఆ సమయంలో నా బలహీనతను చెప్పి నిన్ను నొప్పించలేక పోయాను. నిజం తెలిస్తే నువ్వు నన్ను అంగీకరించవేమో అన్న భయం కూడా నన్ను నోరు మెదపనివ్వలేదు. ఇప్పుడు చెప్పు. నువ్వు నన్ను అసహ్యించుకోవటం లేదు కదా...' ఆమె మోము ఎత్తి పెదవుల వంక తదేకంగా చూస్తూ అడిగాడు గౌతమ్.

లైట్ ఆర్పేసి ఆమె చీకట్లో అతనికి అర్థమయేలా తన పెదవులతో సమాధానం చెప్పింది మాలతి. ■

**టైటానిక్ మోజు**

టైటానిక్ సినిమా సృష్టించిన సంచలనంతో ప్రభావితులైన ఇద్దరు బాలీవుడ్ దర్శకులు వచ్చే సంవత్సరం ఇదే స్టోరితో సినిమాలు తీస్తున్నారు. ఇందులో ఒక సినిమాలో ఆమిర్ ఖాన్, మనీషా కొయిరాలా హీరోయిన్లుగా నటిస్తున్నారు.


**రూ. 2,50,000/-ల విలువగల బహుమతులు గెలుపొందండి**

| | | |
|---|---|---|
| | | |
| | | |
| | | |

ప్రత్యేక బహుమతి: హీరోహోండా మోటార్ సైకిల్ (లేదా) చేతక్ స్కూటర్ (లేదా) కలర్ టి.వి.

| | | |
|---|---|---|
| 8 | 13 | 6 |
| 7 | 9 | 11 |
| 12 | 5 | 10 |

కన్సోలేషన్ బహుమతులు:

మ్యూచువల్ బెనిఫిట్ పథకము ప్రకారం కెమేరా, టూ-ఇన్-వన్, ట్రాన్సిస్టర్, శారీస్, రిస్ట్‌వాచ్.

పై సూచించిన నమూనాలో వలె కాంపిటీషన్ పోస్ట్‌కార్డ్/ఎన్వెలప్/ఇన్‌లాండ్‌పై 9 ఖాళీ గడులను గీయండి. 7 నుంచి 15 వరకు గల అంకెలను ఉపయోగిస్తూ నిలువుగా, అడ్డముగా, ఏటవాలుగా ఎటుకూడినా మొత్తం 33 రావాలి.

ఒక అంకెను ఒక్కసారి మాత్రమే ఉపయోగించాలి. మీ ఎంట్రీలను 10 రోజులలోగా ఆర్డినరీ మెయిల్ ద్వారా పంపండి. ముందుగా చేరిన 10 ఎంట్రీలకు టైటాన్ వాచ్ గోల్డెన్ చైన్ బహూకరించబడును.

**SANDEEP TRADERS (AJSVP)**

POST BOX No: 14, NEW DELHI-110 008